

రెండు గూడ్స్ రైళ్లకు ఒకే లైన్

రెండు గూడ్స్ రైళ్లను ఒకటిగా చేసి గమ్యాలకు చేర్చేందుకు అనువుగా రైల్వే ట్రాక్ నిర్మాణం జరుగుతోంది. లాంగర్ హాల్ట్ లైన్ కోసం నందలూరును ఎంపిక చేశారు. -8లో



బాధితుల చెంతకు ఫోన్లు

పలు ప్రాంతాల్లో జనం పోగొట్టుకున్న ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాధితులను పిలిపించి తిరిగి వారికి అప్పగించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.170	రూ.210
రెండోరకం	రూ.110	రూ.160

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 190 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా శివారెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన పోతుల శివారెడ్డిని రాష్ట్ర కార్యదర్శి (కేంద్ర కార్యాలయం)గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పోతుల శివారెడ్డి చెన్నూరు మండలం ఓబులంపల్లెకు చెందిన నాయకుడు. గతంలో ఆయన ఐటీ విభాగంలో రాష్ట్ర కార్యదర్శిగా సేవలు అందించారు.

రాష్ట్ర లీగల్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుదర్శన్‌రెడ్డి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాకు చెందిన జల్లా సుదర్శన్‌రెడ్డిని రాష్ట్ర లీగల్‌సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న జేడీఏ శివనారాయణ

రాయచోటి జగదాంబసెంటర్: రైతులు ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ పేర్కొన్నారు. రాయచోటిలోని డీపీఎం కార్యాలయంలో శుక్రవారం రైతు సామాజిక సంస్థ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం -2005పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. సమాచార హక్కు చట్టం -2005 గురించి రైతులకు స్పష్టంగా తెలియజేశారు. డీపీఎం వెంకటమోహన్ పాల్గొన్నారు.

4 వేల ఎకరాలలో పండ్ల తోటల సాగు



సిబ్బందితో సమీక్షిస్తున్న పీడీ వెంకటరత్నం

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్): అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా రైతులు 4 వేల ఎకరాలలో పండ్ల తోటలను సాగు చేసినట్లు జిల్లా ఉపాధి హామీ పథక సంచాలకులు వెంకటరత్నం అన్నారు. శుక్రవారం రామాపురంలోని ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ నాలుగు వారాలకు సంబంధించిన బిల్లులు పది రోజుల్లో కూలీల ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. అనంతరం చిట్లూరు గ్రామంలోని సప్లై ఛానల్‌ను, నల్లగుట్టపల్లి గ్రామంలో రైతులు వెంకటరమణ, వెంకటస్వామిలు సాగు చేసిన నిమ్మతోటలను ఆయన పరిశీలించారు. ఏపీఓ పెంచలయ్య, ఈసీ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలతో సరి.. పరిష్కారం మరి?




ఇతని పేరు రామారావు.చిన్నమండెం మండలం కొత్తపల్లి పంచాయతీ శ్రీరామ్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు.ఇతనికి 9వ తరగతి చదువుతున్న దినేష్ రాజు, పదోతరగతి చదువుతున్న తేజస్‌రాజులు పిల్లలు..వీరికి తల్లికి వందనం పడలేదు.. ఏదో సాకు చూపి ప్రభుత్వం ఎగనామం పెట్టింది. మూడు పర్యాయాలు వచ్చి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని చెబుతున్నాడు.

- పీజీఆర్ఎస్ ఫిర్యాదులకు కానరాని మోక్షం
- పెండింగ్‌లో వేలాది అర్జీలు
- పీపుల్స్ ఫ్రెండ్లీగా మార్చడమంటే ఇదేనా?



గ్రీవెన్స్‌సెల్ లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్ (ఫైల్)

రాయచోటి: ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్‌సెల్‌లో ప్రజలు సమర్పిస్తున్న అర్జీల్లో వివిధ కారణాలవల్ల ఇంకా పరిష్కారానికి నోచుకోనివి వేలాదిగా ఉన్నాయి. దరఖాస్తుల పెండింగ్ సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. రీ ఓపెన్ అవుతున్నవి కూడా అధికమే. మండల స్థాయిలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పలుమార్లు తిరిగినా ప్రయోజనం లేకపోవడంతో తమ సమస్యలను కలెక్టర్‌కు చెప్పుకుంటే పరిష్కారమవుతాయన్న ఎంతో నమ్మకంతో వ్యయ ప్రయాసలకోర్చి ప్రజలు వస్తుంటారు. సమస్యలు సావధానంగా వింటున్న కలెక్టర్, జేసీ సంబంధిత శాఖలకు ఆదేశాలు ఇస్తుంటారు. వాస్తవానికి పరిష్కారం కాగితాలకే పరిమితం అవుతోంది తప్ప క్షేత్ర స్థాయిలో అలాగే ఉంటున్నాయి. దీంతో వచ్చిన వారే మళ్లీ వస్తూ వినతులను సమర్పించుకోవాల్సి వస్తోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో స్పందన పేరుతో అర్జీలకు పరిష్కారం త్వరితగతిన జరిగేది. ఈ కార్యక్రమానికి నాటి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చింది. ప్రజలు సమర్పించే అర్జీలు వేగంగా పరిష్కారం కావాలన్న ఉద్దేశంతో 'జగనన్నకు చెబుదాం'అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయమే పర్యవేక్షించిందంటే అర్జీల పరిష్కారానికి గత ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత ఇచ్చేదో అర్థమవుతోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక స్పందన పేరు తొలగించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)గా మార్పు చేసింది. పేరు మార్పుపై ఉన్న శ్రద్ధ అర్జీల పరిష్కారంపై మాత్రం కనిపించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు వాట్సాప్ గవర్నెన్స్ పేరుతో కొత్త నాటకానికి తెర తీసింది.



- పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ ద్వారా ఇప్పటివరకు మొత్తం 88 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 52,198కి గాను 1860 సమస్యలకు పరిష్కారం దొరకలేదు. పోలీస్శాఖ పరంగా 3691 సమస్యల్లో 221 సమస్యలు పెండింగ్ దశలోనే ఉన్నాయి.. రెవెన్యూ శాఖకు సంబంధించి 30,839 వేల వినతులు ఉన్నా యి. వీటిలో కూడా 1260 పెండింగ్ దశలోనే కొనసాగుతున్నాయి.. కొత్తగా ఇంటి స్థలాకు 12544 వినతులు వచ్చాయి. వీటితోపాటు అనేకమంది పక్కా గృహాల నిర్మాణం కోసం విన్నవించినా ప్రభుత్వ వైపు నుంచి స్పందన రాలేదని బాధితులు చెబుతున్నారు. ఫిర్యాదుల్లో అత్యధికభాగం రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ అడ్మిని్స్టేషన్, పంచాయతీరాజ్, పాఠశాల విద్య, ఎస్‌పీడీసీఎల్, హౌసింగ్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, రూరల్ డెవలప్‌మెంట్, పౌరసరఫరాలు, దేవదాయశాఖ, ఆర్అండ్‌బీ వంటి శాఖల నుంచి వస్తున్నాయి.

రెవెన్యూలో అత్యధికం

పీజీఆర్ఎస్ ద్వారా వస్తున్న ఫిర్యాదుల్లో రెవెన్యూశాఖ నుంచే అత్యధికంగా ఉన్నాయని, అందులో ఆర్వోఆర్‌కు సంబంధించినవే ఎక్కువగా ఉన్నట్లు ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొనడం గమనార్హం. ఫిర్యాదుల పరిష్కారంలో ఆడిట్ కూడా నిర్వహిస్తున్నామని చెప్పినప్పటికీ దాని ఫలితాలు ఎక్కడా కనిపించలేదు. రెవెన్యూశాఖను పీపుల్స్ ఫ్రెండ్లీగా మారుస్తామని ప్రకటనలు గుప్పించడం మినహా ఆచరణలో చేస్తున్నది మాత్రం శూన్యం. పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీల పరిష్కారమే ఇందుకు నిదర్శనం. అంశాల వారీగా పరిశీలిస్తే రెవెన్యూ రికార్డుల్లో నమోదైన పేరు, రిలేషన్, ఆధార్, మొబైల్ నెంబరు వంటి ఎంట్రీస్‌లో తప్పులను సరిదిద్దేందుకు వేల అర్జీలు వచ్చాయి. ఇందులో వందల సంఖ్యలోనే పెండింగ్‌లో ఉన్నాయి. ఆర్ఓఆర్‌మ్యూటేషన్లపై వచ్చిన వినతులు అనేకం పరిష్కారానికి నోచుకోలేదు. ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి ఫిర్యాదులు వచ్చాయి. భూకబ్జాలకు సంబంధించిన ఫిర్యాదులు అలాగే ఉన్నట్లు తెలుస్తోంది. రీ సర్వే సందర్భంగా ఆర్వోఆర్‌లో దొర్లిన తప్పులను సరిదిద్దాలంటూ అందిన ఫిర్యాదులకు అధికారుల నుంచి తగిన రీతిలో స్పందన రావడం లేదు. ఇక ప్రభుత్వ భూముల కబ్జాకు సంబంధించిన ఫిర్యాదులకు ఉలుకు పలుకు లేదన్న విమర్శలు ఉన్నాయి. జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణానికి ప్రాజెక్టుల కోసం చేపట్టిన భూసేకరణ పరిహారం చెల్లింపు ఆలస్యం అవుతోంది. ఇక ఇతర అంశాలకు సంబంధించి వేల అర్జీలకు మోక్షం లభించలేదు. ఇలా ఆయా శాఖల్లో పలు అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

6 నెలలుగా తిరుగుతున్నా...



నాకు 1.5 ఎకరాల భూమి ఉంది. ఆన్‌లైన్ కోసం 6 నెలలుగా తిరుగుతున్నా. పీలేరు ఎమ్మార్వో పలకడం లేదు... కలెక్టరేట్‌కు రెండు సార్లు వచ్చాను.. నేను లేని సమయంలో మా పక్క భూమి వాళ్లు సర్వే చేయించుకుని ఆన్‌లైన్ చేసుకున్నారు. వారి ఆన్‌లైన్ తొలగించాలని కోరుతున్నా స్పందన లేదు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

-సఫియాబీ, జాండ్ల గ్రామం, పీలేరు

అధికారులు నిబద్ధతతో పని చేయాలి

జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

తంబళ్లపల్లె: సమగ్ర అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది నిబద్ధతతో పని చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం తంబళ్లపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో అసెంబ్లీ నియోజకవర్గ తహసీల్దార్లు, ఎంపీడీఓలతో వివిధ అంశాలపై నియోజకవర్గస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శనివారం సాయంత్రంలోపు అధికారులు తమ నియోజకవర్గ స్థాయి సమస్యలకు సంబంధించిన వివరాలను సిద్ధం చేసి, స్పెషల్ ఆఫీసర్లకు తప్పనిసరిగా పంపాలన్నారు. తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పైప్‌లైన్ ఎక్కడా డ్రైనేజీ లైన్‌తో కలిసిపోకుండా చూడాలన్నారు. అంతకుముందు మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి అమరనాథరెడ్డి, బి.కొత్తకోట మున్సిపల్ కమిషనర్ పల్లవి పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు వల్ల చేకూరే లబ్ధిపై అవగాహన పెంచాలి

రాయచోటి: సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమం ద్వారా జీఎస్టీ తగ్గించడంవల్ల చేకూరే లబ్ధిపై ప్రజల్లో అవగాహన పెంచాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం అమరావతి నుంచి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ వివిధ అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీసీ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.కలెక్టరేట్ నుంచి కలెక్టర్ నిశాంత్ కుమార్, జేసీ ఆదర్శరాజేంద్రన్‌లు పాల్గొన్నా రు. జీఎస్టీ రేట్ల తగ్గింపు వల్ల ప్రజలకు చేకూరే లబ్ధిపై ఈ నెల 25 నుంచి అక్టోబర్ 19 వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ జిల్లా అధికారులకు సూచించారు.

జయశుభకారిణి..విజయరూపిణి



రాయచోటిటౌన్: రాజరాజేశ్వరీదేవిగా శ్రీ భద్రకాళీ అమ్మవారు



మదనపల్లెసిటీ: మహాలక్ష్మి అలంకారంలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి



రాజంపేట టౌన్: మోహినీదేవిగా వాసవీమాత

శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మిక వైభవం ఉట్టిపడుతోంది.విద్యుద్దీపాలంకరణలతో అమ్మవారి ఆలయాలు వెలుగులీనుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. జయములీవు జగజ్జననని అంటూ వేడుకున్నారు.

-సాక్షి నెట్‌వర్క్

గుట్టల్లో పారబోసిన షూలు స్వాధీనం

సాక్షి ఎఫెక్ట్..



షూలను పరిశీలిస్తున్న సీఎంవో కరుణాకర్

పెద్దతిప్పసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మంజూరైన షూలను మండల కేంద్రానికి సమీపంలోని బోడిగుట్ట వెనుక వైపున వ్యవసాయ పొలాల్లో గుట్టల నడుమ పారబోశారు. ఈ విషయంపై శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'గుట్టల్లో గుట్టుగా విద్యార్థుల షూ'లు వార్తపై జిల్లా కలెక్టర్ స్పందించారు. పారబోసిన షూలను స్వాధీనం చేసుకుని సమగ్రంగా విచారణ చేయాలని డీఈఓ కె.సుబ్రమణ్యంకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో డీఈఓ నేతృత్వంలో జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి (సీఎంవో) కరుణాకర్, స్థానిక ఎంఈఓ గౌస్‌పీర్,సీఆర్‌పీ నాగరాజుతో కలిసి షూలను గుట్టల నడుమ పారబోసిన స్థలాన్ని పరిశీలించారు. షూలను స్వాధీనం చేసుకుని మండల కేంద్రంలోని స్టాక్ పాయింట్‌లో భద్రపరిచారు. వీటిని ఎవరు పారబోశారనే విషయంపై సమగ్రంగా విచారణ చేపట్టి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని సీఎంవో వెల్లడించారు.

రూ.925 కోట్లతో హంద్రీ-నీవా పనులు

ఎస్ఈ విఠల్‌ప్రసాద్



మదనపల్లె: జిల్లాలో హంద్రీ-నీవా ప్రధానకాలువ, నీవా ఉప కాలువల అసంపూర్తి పనులు, వాటికి కొత్త కాంక్రీట్ లైనింగ్ పనులు చేయించడం కోసం రూ.925 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు మదనపల్లె సర్కిల్-3 ఎస్ఈ ఆర్.విఠల్‌ప్రసాద్ చెప్పారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీనివాసపురం, అడివిపల్లె రిజర్వాయర్లకు కృష్ణా జలాలను తరలించడం కోసం మిగిలిపోయిన పనులను పూర్తి చేయించాల్సి ఉందని చెప్పారు. దీనికోసం ప్రధాన కాలువ ప్యాకేజీ-1కు రూ.242.95 కోట్లు, ప్యాకేజీ-2కు రూ.177.81 కోట్లు, నీవా ఉప కాలువ అసంపూర్తి పనులు, లైనింగ్ కోసం మూడు ప్యాకేజీల్లో రూ.504.55 కోట్లతో పనులు చేపట్టేందుకు ఆమోదం తెలపాలని కోరుతూ సీఈ ప్రభుత్వానికి నివేదించారని చెప్పారు. ప్రస్తుతం కుప్పం నియోజకవర్గంలోని చెరువులను కృష్ణా జలాలతో నింపుతున్నామని అన్నారు. కాలువలో ప్రవహిస్తున్న నీటిని రైతులు పైపుల ద్వారా, మోటార్లతో నీటి చౌర్యానికి పాల్పడుతున్నారని అన్నారు. కాలువను తెగ్గొట్టడం, నీటిని మళ్లించుకోవడం లాంటి చర్యలు పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో జరుగుతోందన్నారు. దీనిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అధికారికంగా ప్రణాళిక ప్రకారం నీటిని తరలిస్తామని చెప్పారు. ఎక్కడైనా కాలువను తెగ్గొడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మిథున్‌రెడ్డి అరెస్ట్‌లో వేధింపులే లక్ష్యం

- మాజీ మంత్రి పెద్దిరెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక కుమారుడిపై కుట్రలు, కుతంత్రాలు
- బెయిల్ పిటిషన్‌పై కోర్టు విచారణను అడ్డుకునేలా కస్టడీ
- జూలై 19న అరెస్ట్..జైలు, కస్టడీ.. రిమాండ్‌తో అటూఇటూ తిప్పుతున్నారు



ఈనెల 18న విజయవాడ ఏసీబీ కోర్టుకు హాజరైన ఎంపీ మిథున్‌రెడ్డి

మదనపల్లె: సాక్ష్యాలులేని అక్రమ కేసుల్లో తనను అరెస్ట్ చేసి కూటమి ప్రభుత్వం వేధించేందుకు సిద్ధమైందని మిథున్‌రెడ్డి ముందే పసిగట్టారు. తానొక ఎంపీని, రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాల్లో తన ప్రమేయం, సంబంధం ఉండదు, అయినా తనను లక్ష్యంగా చేసుకుని వేధించేందుకు సిద్ధమయ్యారని మిథున్‌రెడ్డి స్పష్టంగా చెప్పినా, ఆరోపణలపై సాక్ష్యాలు చూపాలని కోరినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. ఈ పరిస్థితుల్లో ఆయన చెప్పినట్టే జూలై 19న సిట్ అధికారులు అరెస్ట్ చేసినట్టు ప్రకటించారు.. మాజీ మంత్రి పెద్దిరెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక కూటమి ప్రభుత్వం ఆయన కుమారుడిపై కుట్రలు పన్నుతోంది.

- పెద్దిరెడ్డి కుమారుడు మిథున్‌రెడ్డి చిన్న వయసులోనే రాజంపేట పార్లమెంట్ ఓటర్ల మనసును గెలుచుకుని వారికి దగ్గరయ్యారు. 2014లో తొలిసారి ఎన్టీఆర్ కుమార్తె పురందేశ్వరీని ఓడించి మిథున్‌రెడ్డికి అధిక మెజార్టీ ఇచ్చారు.ఇదికాక పెద్దిరెడ్డి తమ్ముడు, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని ఓడించాలని గత ఎన్నికల్లో చంద్రబాబు ఎన్ని ఎత్తులు వేసినా ఓటర్లు ద్వారకనాథరెడ్డిని గెలిపించారు.

'గత టీడీపీ హయాంలో తప్పుడు కేసు పెట్టగా నిరూపణ కాకపోవడంతో కొట్టేశారు. ఇప్పుడు మళ్లీ టీడీపీ అధికారంలోకి వచ్చింది. అరెస్టుకు భయపడే ప్రసక్తేలేదు. రాజకీయంగా ధైర్యంగా ఎదుర్కొంటాను. ఓ బెటర్ పర్సన్‌గా బయటకొస్తాను. మీకు సహకరిస్తాను, సాక్ష్యాలు చూపండంటే చూపలేదు.నోటిమాటతో ముఖ్యనేతలను టార్గెట్ చేసి అక్రమకేసులతో వేధిస్తున్నారు.'

-జూలై 19న అరెస్ట్‌కు ముందు ఎంపీ మిథున్‌రెడ్డి

'నేను చెప్పేది ఒకటే..మేం ఇంట్లో పది మంది ఉన్నాం. నన్ను అరెస్ట్ చేసినా పట్టించుకోను..దేనికైనా సిద్ధం. నన్ను చంపినా పర్వాలేదు. నా ఇంట్లో నా తమ్ముడో, మా అమ్మో వస్తుంది..కచ్చితంగా మేము రాజకీయాల్లో ఉంటాం. ప్రజలకు అండగా నియోజకవర్గంలో నిలబడతాం.'

-అరెస్ట్‌కు కొన్నాళ్ల ముందు ఎంపీ మిథున్‌రెడ్డి

మానసికంగా వేధించాలనే...

కూటమి ప్రభుత్వం మాజీ మంత్రి పెద్దిరెడ్డిని మానసికంగా వేధించే మార్గం ఎంచుకుంది. ఆయన కుమారుడు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని మద్యం అక్రమ కేసులో జూలై 19న చంద్రబాబు ప్రభుత్వం అరెస్ట్ చేయించింది. ఇప్పటిదాకా బెయిలు రాకుండా మానసిక వేధింపులకు గురిచేస్తోంది.

- గత తెలుగుదేశం పార్టీ పాలనలోనే రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై కక్ష కట్టారు. 2014లో తొలిసారి రాజంపేట ఎంపీగా పోటీ చేసి రికార్డు స్థాయి మెజార్టీతో గెలుపొందారు. ఈ విజయాన్ని జీర్ణించుకోలేక.. అప్పుడే వేధింపులకు శ్రీకారం చుట్టారు. రేణిగుంట విమానాశ్రయంలో ఓ ఉద్యోగిపై దాడి చేసినట్టు అక్రమ కేసు నమోదు చేశారు. ఈ కేసులో సాక్ష్యాలులేక న్యాయస్థానం కొట్టివేసిందని మిథున్ రెడ్డి ఓ సందర్భంలో వెల్లడించారు. దీన్నిబట్టి చూస్తే మిథున్‌రెడ్డి రాజకీయ ఎదుగుదల, ప్రజాబలం చూసి ఓర్వలేక పోతున్నట్టు అర్థమవుతోంది. గత టీడీపీ ప్రభుత్వం పెట్టిన కేసు నిరాధారమని తేలిపోవడంతో ఇప్పుడు మద్యం అక్రమ కేసులో అరెస్టు చేసి వేధిస్తున్నారు.

62 రోజుల తర్వాత కస్టడీకి

జూలై 19న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని మద్యం అక్రమ కేసులో అరెస్ట్ చేశారు. తర్వాత విచారణ కోసం సిట్ కస్టడీని కోరవచ్చు. అయితే అరెస్ట్ చేసిన రెండునెలలకు కస్టడీ కోరిన సిట్‌కు రెండు రోజుల విచారణకు న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. అరెస్ట్ అయిన 62 రోజుల తర్వాత కస్టడీలోకి తీసుకుని విచారించారు. సిట్ కస్టడీ కోరినప్పటికే మిథున్‌రెడ్డి తరఫున న్యాయస్థానంలో బెయిల్ పిటిషన్ దాఖలైంది. బెయిల్‌ను కస్టడీ ద్వారా అడ్డుకునేందుకు ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారన్న భావన నెలకొంటోంది.

నేటి నుంచి అంగన్వాడీలకు సెలవులు



రాయచోటి జగదాంబ సెంటర్: జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ సెంటర్లకు 27 నుంచి దసరా సెలవులను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అక్టోబర్ 4వ తేదీల వరకు దసరా సెలవులు ఉండనున్నట్లు అధికారులు తెలిపారు. అంగన్వాడీల సిబ్బంది వినతి మేరకు ప్రభుత్వం సెలవులను మంజూరు చేసినట్లు వారు పేర్కొన్నారు.

క్లుప్తంగా

ద్విచక్ర వాహనాల చోరీ

మదనపల్లె రూరల్ : వేర్వేరు ప్రాంతాల్లో రెండు ద్విచక్ర వాహనాలు చోరీ చేసినట్లు టూటౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు. ఈ నెల 24న పట్టణంలోని వీవర్స్ కాలనీకి చెందిన బండమీద రెడ్డిశివ తన ప్యాషన్‌ప్రో వాహనాన్ని ఇంటి వద్ద ఉంచి నిద్రించాడు. ఉదయం లేచిచూడగా బైక్ కనపడకపోవడంతో చుట్టుపక్కల వెతికాడు. కనిపించకపోవడంతో టూటౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. అదే విధంగా పట్టణంలోని శేషప్ప తోటలో ఆగస్టు 10న రంగస్వామి దామోదరం తన ద్విచక్రవాహనాన్ని ఇంటి ముందు నిలిపి ఉంచారు. 11న ఉదయం చూయడగా బైక్ కనిపించలేదు. నెలరోజులుగా తానే స్వయంగా బైక్ ఆచూకీ కోసం వెతికాడు. అయినా లభించకపోవడంతో శుక్రవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. రెండు ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చిన్నారిపై కుక్కల దాడి


కుక్క కాటుకు గురైన శార్ధీక్‌రెడ్డి

సిద్ధవటం : ఓ చిన్నారిపై కుక్కలు దాడి చేయడంతో గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని జ్యోతి గ్రామంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపుగా తిరుగుతూ ప్రజలను చుట్టుముట్టి కరుస్తున్నాయి. శుక్రవారం చిన్నారి శార్ధీక్‌రెడ్డి(4)పై విచక్షణా రహితంగా దాడిచేశాయి. మెరుగైన వైద్య సేవల కోసం బాలుడి తల్లిదండ్రులు కడప రిమ్స్ వైద్యశాలకు తరలించారు. రాత్రి వేళల్లో ద్విచక్రవాహనాల వెంబడి పరుగులు తీస్తున్నాయని, అధికారులు తక్షణమే స్పందించి శునకాలను పట్టి తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అప్పుల బాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య


నరసింహులు (ఫైల్)

మదనపల్లె రూరల్ : అప్పుల బాధ భరించలేక.. మనస్తాపం చెందిన చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం అర్ధరాత్రి జరిగింది. ములకలచెరువు మండలం మద్దినాయునిపల్లె పంచాయతీ గొంగివారిపల్లెకు చెందిన సుబ్బరాము కుమారుడు నరసింహులు(38) భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఐదేళ్ల కిందట ఉపాధి కోసం మదనపల్లెకు వచ్చాడు. నీరుగట్టివారిపల్లె చౌడేశ్వరీనగర్‌లో ఉంటూ స్థానికంగా మగ్గం పనులకు వెళుతున్నాడు. ఈ క్రమంలో కుటుంబ అవసరాల నిమిత్తం పలువురి వద్ద రూ.5 లక్షల వరకు అప్పుచేశారు. తిరిగి చెల్లించలేకపోవడంతో గత కొంతకాలంగా రుణదాతల ఒత్తిడి అధికమైంది. ప్రతి రోజూ ఇంటివద్దకు వచ్చి అప్పు చెల్లించాలని నిలదీస్తుండడంతో మనస్తాపం చెంది గురువారం రాత్రి ఇంట్లోనే సూపర్ వాస్మోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు బాధితుడిని మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం నరసింహులు మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు.

రెండు గూడ్స్ రైళ్లకు ఒకే లైన్

బొగ్గు, ఐరన్‌ఓర్ తదితర వాటిని తరలిస్తూ.. రైల్వేకు ఆదాయం కల్పించే గూడ్స్ రైళ్లు నిర్దేశిత సమయంలో వాటి గమ్యాలకు చేరడం లేదు. ఫలితంగా రైల్వేకు ఆదాయం తగ్గుతోంది. ఈ సమస్య అధిగమించేందుకు రెండు గూడ్స్ రైళ్లను ఒకటిగా చేసి గమ్యాలకు చేర్చేందుకు అనువుగా రైల్వే ట్రాక్ నిర్మాణం జరుగుతోంది.


నందలూరు రైల్వే కేంద్రంలో లాంగర్‌హాల్ట్ లైన్ నిర్మాణ పనులు


గూడ్స్ రైళ్ల ట్రాఫిక్‌తో నందలూరు రైల్వే కేంద్రం యార్డు

- నందలూరు రైల్వేకేంద్రం ఎంపిక
- లాంగ్‌హాల్ట్ కోసం నూతన రైల్వే ట్రాక్
- కృష్ణపట్నం పోర్టు, జిందాల్ గూడ్స్‌రైళ్ల కోసం నిర్మాణం

రాజంపేట : బ్రిటీష్ పాలకుల నుంచి రైల్వేపరమైన అభివృద్ధి విషయంలో నందలూరు రైల్వే అనుకూలంగానే ఉంది. అందుకే లాంగర్ హాల్ట్ లైన్ కోసం నందలూరును ఎంపిక చేశారు. ఎర్రగుంట్ల జంక్షన్ సమీపంలో ఉన్న గ్రామీణ రైల్వే స్టేషన్ ఎర్రగుడిపాడులోనూ లాంగర్ లూప్‌లైన్ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ఉమ్మడి కడప జిల్లాలో ఇది వరకూ ఉన్న ముంబయి–చెన్నై కారిడార్ రైలు మార్గంలోని గుత్తి–రేణిగుంట మధ్య ఉన్న రైల్వేస్టేషన్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల ట్రాఫిక్ తీరని అంతరాయం కలిగిస్తోంది. దీంతో నందలూరు రైల్వే కేంద్రానికి చేరుకొనే రెండు గూడ్స్ రైళ్లను కొత్తగా నిర్మితం కానున్న లైన్‌లోకి తీసుకొని జతచేసి, ఒకేసారి గమ్యానికి చేర్చే దిశగా రైల్వే నిర్ణయం తీసుకుంది. ఫలితంగా సకాలంలో ఎగుమతి, దిగుమతులకు అవకాశం కలుగుతుంది. గూడ్స్ రైళ్ల రవాణాను మరింత వేగవంతం చేసేందుకు మార్గం సుగమమవుతుందని రైల్వేనిపుణులు చెబుతున్నారు.

రవాణా గూడ్స్ రైళ్లే లక్ష్యంగా..

కృష్ణపట్నం పోర్టు నుంచి జిందాల్ పరిశ్రమకు బొగ్గు, ఐరన్ ఓర్ రవాణా చేసే గూడ్స్ రైళ్లు.. ఫార్మిసిన్ గార్డు బ్రేక్‌తో కలుపుకొని 60 వ్యాగిన్లు ఉంటాయి. ఇదే సామర్థ్యం కలిగిన గూడ్స్ రైళ్లు ఫార్మిసిన్ లాంగర్ లూప్ లైన్‌లోకి తీసుకొని, జతచేసి లైన్ క్లియర్ చేసి నడపనున్నారు. ప్రధానంగా ఆస్ట్రేలియా తదితర దేశాల నుంచి బొగ్గు కృష్ణపట్నం పోర్టుకు చేరుకుంటుంది. అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారు. సహజంగా ప్లాట్‌ఫాంలో లైన్ 800 మీటర్ల మేర ఉంటుంది. రెండు గూడ్స్ రైళ్లు నిలబడే విధంగా ట్రాక్ ఎక్కడా లేదు. అంత యార్డూ లేదు. ఒక్క నందలూరులోనే ఉండడం గమనార్హం. అందుకే ఇక్కడ లాంగర్‌లూప్.. లాంగర్ హోల్డింగ్‌కు అనుకూలంగా నందలూరును మార్చుకునే దిశగా రైల్వేశాఖ నిర్మాణ పనులు చేపట్టింది. ఒక కిలోమీటర్ మేర ట్రాక్ నిర్మిస్తున్నారు. నందలూరు రైల్వే కేంద్రం నుంచి దాదాపు పాత రైల్వేగేట్ (మంటంపంపల్లె) వరకు ట్రాక్ నిర్మాణం జరుగుతోంది. ఆ దిశగా సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో ట్రాక్ నిర్మితం అవుతోందని రైల్వే వర్గాలు చెబుతున్నాయి. దాదాపు 120 వ్యాగిన్లు కలిగిన బొగ్గు గూడ్స్ రైలు ఫార్మిసిన్‌ను ఒకేసారి నడిపించేలా రైల్వేశాఖ చర్యలు చేపట్టింది. ఇందుకోసం నాలుగు లోకోల(కరెంట్ రైలిజంన్ల)ను వినియోగించనున్నారు. బ్రిటీషు కాలం నుంచి రన్నింగ్ స్టాప్ క్రూ సెంటర్ (ఎల్‌పీ,ఎఎల్‌పీ,గార్డు) కొనసాగుతోంది. ఇది కూడా గూడ్స్‌రైళ్ల ట్రాఫిక్‌కు కలిసివచ్చే అంశంగా రైల్వే నిపుణులు పేర్కొంటున్నారు.

పోగొట్టుకున్న ఫోన్లు.. బాధితుల చెంతకు


ఫోన్లను అందుకున్న వారితో జిల్లా ఎస్పీ ధీరజ్ కనుబిల్లి

- రూ.1.5 కోట్ల విలువగల 610 ఫోన్లు స్వాధీనం
- జిల్లా ఎస్పీ ధీరజ్ కనుబిల్లి

రాయచోటి : పలు ప్రాంతాల్లో జనం పోగొట్టుకున్న ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాధితులను పిలిపించి తిరిగి వారికి అప్పగించారు. ఎస్పీ ధీరజ్ కనుబిల్లి వివరాల మేరకు.. ఈ ఏడాది జూలై నుంచి సెప్టెంబరు మధ్య కాలంలో పలువురు పోగొట్టుకున్న రూ.1.5 కోట్ల విలువగల 610 మొబైల్ ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్, ఒక ట్యాబ్‌ను రికవరీ చేశారు. రాయచోటి ఎస్పీ కార్యాలయం ఆవరణంలో బాధితులకు పిలిపించి వారికి అప్పగించారు. అనంతరం మీడియాతో ఎస్పీ మాట్లాడుతూ ఫోన్లను పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్ అండ్ సోషల్ మీడియా, టెక్నికల్ అనాలసిస్ వింగ్, మొబైల్ రికవరీ ప్రత్యేక బృందాలు రికవరీ చేశామన్నారు. ఏడు విడతలుగా రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు అందించామని తెలిపారు. ఎనిమిదో విడతగా రూ. 4.66 కోట్లు విలువ కల్గిన 2237 మొబైల్ ఫోన్లను బాధితులకు అందించినట్లు తెలిపారు. మొబైల్ రికవరీ మేళాలో బాధితులు ఫోన్లు తీసుకొని సంతోషంగా తిరుగు ప్రయాణం అయ్యారన్నారు. మొబైల్ ఫోన్ల రికవరీకి కృషి చేసిన రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ టి.జాన్‌జోసఫ్, సీఐ ఎస్.మహమ్మద్‌అలీ, టెక్నికల్ అనాలసిస్, సైబర్ క్రైమ్ అండ్ సోషల్ మీడియా సిబ్బంది, పోలీసుల బృందాన్ని ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు.

విద్యుత్ షాక్‌తో రిటైర్డ్ ఆర్మీ అధికారి మృతి

చాపాడు : మండలంలోని చెంచుపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ అధికారి మూల లక్ష్మిరెడ్డి(55) గురువారం రాత్రి విద్యుత్ షాక్‌తో మృతిచెందారు. బంధువుల వివరాల మేరకు.. ఆర్మీలో వివిధ కేడర్లలో పనిచేసిన లక్ష్మిరెడ్డి మూడేళ్ల కిందట పదవీ విరమణ పొంది ప్రొద్దుటూరులో నివాసముంటున్నారు. ఇంటివద్ద కొళాయి మోటారుకు మరమ్మతులు చేపడుతూ ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. అన్నమయ్య జిల్లా కలికిరి వద్ద ఉన్న రిటైర్డ్ ఆర్మీ సిబ్బందికి బంధువులు తెలియజేయడంతో ఆర్మీ అధికారులు వచ్చి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉండగా వారికి వివాహమైంది. కుమారుడు ఇంజనీరింగ్ చదువుతున్నాడు. రిటైర్డ్ ఆర్మీ అధికారి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పొలాల్లో మృతదేహం

జమ్మలమడుగు : మండలంలోని సుగుమంచిపల్లె పొలాల్లో గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మరణించిన వ్యక్తి ప్రొద్దుటూరు వాసి శివకుమార్(36) గుర్తించారు. శివకుమార్ అనారోగ్యానికి గురై తాగుడుకు బానిస కావడంతో ఎక్కడ పడితే అక్కడ తిరుగుతుంటాడని బంధువులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

చిరంజీవికి బేషరతుగా క్షమాపణ చెప్పాలి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి : మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, హీరో చిరంజీవిలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే బాలకృష్ణ అసెంబ్లీలో బేషరతుగా క్షమాపణలు చెప్పాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాయచోటి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ స్పీకర్ స్థానంలో ఉన్న అయ్యన్నపాత్రుడు క్షమాపణ చెప్పడంతోపాటు బాలకృష్ణతోనూ క్షమాపణ చెప్పించాలన్నారు. రాష్ట్ర ప్రజలను అవమానించేలా తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధుల తీరు కొనసాగుతోందని, కక్షపూరిత రాజకీయాలు చేయను అని చెబుతూనే తమ పార్టీ నాయకులకు వెనుక నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలు, దాడులు, బ్రిటీష్ తుగ్లక్ పాలనను మించి జరుగుతున్నాయన్నారు. హోంమంత్రి, డిప్యూటీ స్పీకర్లు హద్దుమీరి మాట్లాడుతుండటం దారుణమన్నారు. తెలుగుదేశం మంత్రులు వ్యక్తిగతంగా దూషిస్తూ అసభ్య పదజాలతో రెచ్చిపోవడం వారి దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. చిత్ర పరిశ్రమలో చిరంజీవితో పోటీపడలేక అక్కసు వెళ్లగక్కుతూ బాలకృష్ణ శాసనసభకు మద్యం తాగి వచ్చారన్నారు. నాలుగేళ్ల కిందట అలాగా జనం, అలగా నా కొడుకు, సంకరజాతి వాడంటూ మాట్లాడిన బాలకృష్ణ ఇంకా తన తీరు మార్చుకోలేదన్నారు. ఎన్టీరామారావు కుమారుడు అని మరచిపోయి అసెంబ్లీలో ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. తన గన్నుతో ఒక మనిషిని కాల్చి చంపడానికి ప్రయత్నించిన బాలకృష్ణ సైకో కాదా అని శ్రీకాంత్ రెడ్డి ప్రశ్నించారు. మెంటల్ సర్టిఫికెట్ తీసుకున్న బాలకృష్ణ స్వయం కృషితో ఎదిగిన చిరంజీవిని ఇంత ఘోరంగా అవమానిస్తే తమ్ముడు పవన్ కళ్యాణ్ నోరు మెదపకపోవడం దుర్మార్గమన్నారు. అసెంబ్లీలో బాలకృష్ణ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలన్నారు. అనేక సందర్భాలలో మహిళలను అవహేళన చేస్తున్నా.. రామారావు కుమారుడున్న కారణంగానే బాలకృష్ణను అందరూ గౌరవిస్తున్న విషయాన్ని గుర్తించాలన్నారు.

యర్రగుంట్ల మున్సిపాల్టీలో వార్డుల పెంపు

ఇక నుంచి 27 వార్డులు


మాట్లాడుతున్న చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, కమిషనర్

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల పురపాలక సంఘం పరిధిలో మరో ఏడు వార్డులను పెంచేందుకు డీఎంఏ(డైరెక్ట్ మున్సిపాలిటీ ఆథారిటీ) ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసిందని మున్సిపల్ కమిషనర్ శేషఫణి, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రస్తుతం మున్సిపాల్టీలో 20 వార్డులు ఉండగా, 32572 మంది నివసిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఈ సంఖ్య ఇంకా పెరిగి ఉండవచ్చునని భావిస్తున్నామని తెలిపారు. ఇపుడు మున్సిపాలిటీలో ఏడు వార్డులు అదనంగా పెంచుతున్నట్లు ఉత్వర్వులు వచ్చాయని ఆయన తెలిపారు. ఎవరికైనా అభ్యర్థనలుంటే అక్టోబరు ఆరో తేదీలోగా మున్సిపాలిటీలో స్వీకరిస్తామని, 8వ తేదీలోగా పూర్తి నివేదిక కలెక్టర్‌కు పంపిస్తామని పేర్కొన్నారు. 10న డీఎంఏ (డెరెక్ట్ మున్సిపాలీటీ ఆథారిటి)కి పంపిస్తామని, 12న ప్రభుత్వానికి పంపగా, 14న జీవో విడుదల అవుతుందని తెలిపారు. యర్రగుంట్ల పురపాలక సంఘంలో 27 వార్డులు ఏర్పాటుకానున్నాయని, ఓటరు శాతం ప్రకారం ఒక్కో వార్డుకు 850కి తక్కువ కాకుండా విభజించాల్సి ఉంటుందని తెలిపారు. వార్డుల విభజనపై టీఎంపీ విభాగం కసరత్తు ప్రారంభించారని, 1 నుంచి 20వ వార్డు వరకు అన్నింటినీ పరిశీలించి విభజిస్తామని పేర్కొన్నారు.

అత్యుత్తమ పరిశోధకుల జాబితాలో ఎల్‌వీపీఈఐ


ర్యాంకింగ్స్‌లో స్థానం పొందిన ఎల్‌వీపీఈఐ వైద్య బృందం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతిష్టాత్మక 2025 స్టాన్‌ఫోర్డ్/ఎల్సెవియర్ టాప్–2 సైంటిస్ట్ జాబితా ప్రామాణిక సైటేషన్ మెట్రిక్స్ ఆధారంగా ప్రపంచంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన పరిశోధకుల జాబితా విడుదలైంది. ఎల్‌వీప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ (ఎల్‌వీపీఈఐ) మరోసారి ప్రపంచ నాయకత్వాన్ని ప్రదర్శించిందని ఆ వైద్యశాల హెడ్ డాక్టర్ కావ్యమాధురి బెజ్జంకి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఏడుగురు ఎల్‌వీపీఈఐ అనుబంధ క్లినిషియన్ శాస్త్రవేత్తలు జీవితకాల ర్యాంకింగ్స్‌లోనూ, 15 మంది 2025 వార్షిక ర్యాంకింగ్స్‌లోనూ చోటు దక్కించుకున్నారని చెప్పారు. ఎల్‌వీపీఈఐ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గుళ్లపల్లిఎన్.రావు భారతదేశంలోనే నేత్ర వైద్య రంగంలో జీవితకాల ర్యాంకింగ్‌లో రెండవ స్థానంలో నిలిచారన్నారు. ఆయతోపాటు మరో ఆరుగురు పరిశోధకులు సావిత్రిశర్మ, ప్రొఫెసర్ బాలసుబ్రహ్మణ్యన్ మహ్మద్ జావిద్ అలీ, ప్రశాంత్ గర్గ్, తారాప్రసాద్ దాస్, స్వాతి ఉత్తమ ర్యాంకుల జాబితాలో ఉన్నారని చెప్పారు. 2025 సంవత్సరానికిగానూ 61 మంది భారతీయ నేత్ర వైద్య శాస్త్రవేత్తలు వార్షిక ర్యాంకింగ్స్‌లో స్థానం సంపాదించుకోగా మహ్మద్ జావిద్ అలీ, స్వాతి కలికి, సావిత్రి శర్మ, ప్రశాంత్ గర్గ్, సయన్ బసు, రోహిత్ ఖన్నా, గుళ్ళపల్లి ఎస్.రావు, స్వాతి సింగ్, తారాప్రసాద్ దాస్, ఎలిజబెత్ కీఫ్, వివేక్ సింగ్, పవన్ కుమార్ వెర్కిచర్ల, ప్రొఫెసర్ బాలసుబ్రమణియన్, మిలింద్ నీలకంఠ నాయక్, సుభద్ర జలాలిలు జాబితాలో చోటు సంపాదించారని తెలిపారు.

జేఎన్‌టీయూలో యంత్ర 2025 జాతీయ సదస్సు


యంత్ర 2025 ప్రారంభిస్తున్న ప్రముఖులు

పులివెందుల టౌన్ : స్థానిక జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగంలో శుక్రవారం యంత్ర 2కె25 మూడు రోజుల విద్యార్థుల జాతీయ సదస్సును ఘనంగా ప్రారంభించారు. యూసీఐఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రభాస్‌రంజన్, న్యూటెక్ బయోసైన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ వసంత్‌కుమార్, విశాఖపట్టణం పోర్ట్ అథారిటీ గ్రేడ్–1 అసిస్టెంట్ సెక్రటరీ అజయ్‌తేజా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి 500మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రభాస్‌రంజన్ మాట్లాడుతూ మానవుడి జీవితంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), చాట్ జీపీటీ ప్రాముఖ్యత, దాని ప్రయోజనాలు వివరించారు. అనంతరం విశిష్ట అతిథులు ఇంజినీరింగ్ ప్రాముఖ్యత వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డి.విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపల్ ఎం.శేషమహేశ్వరమ్మ, మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటాలి


చిన్నారులతో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమార్ గుప్తా, తదితరులు

పులివెందుల టౌన్ : విద్యార్థులు సృజనాత్మకతతో జాతీయస్థాయిలో సత్తా చాటాలని ఆర్డీఓ చిన్నయ్య అన్నారు. స్థానిక న్యాక్ బిల్డింగ్ సమీపంలో న్యూఢిల్లీ యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శుక్రవారం ప్రారంభించారు. ఆర్డీఓ చిన్నయ్య మాట్లాడుతూ యుఎస్ఓ లాంటి ఎన్జీవో సంస్థలు దేశవ్యాప్తంగా విద్యార్థి సమగ్ర సంపూర్ణ వ్యక్తిత్వానికి సహకారం అందించి సఫలీకృతం అవుతున్నారని ప్రశంసించారు. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమార్‌గుప్తా మాట్లాడుతూ యుఎస్ఓ జాతీయ స్థాయి పోటీలను పులివెందులలో నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు. విద్యార్థులు చదువుకు మాత్రమే పరిమితం కాకుండా పోటీ ప్రపంచంలో కావాల్సిన అన్ని నైపుణ్యాలను నేర్చుకోవాలన్నారు. సెక్రటరీ జనరల్ నీనాజైన్ మాట్లాడుతూ పది రాష్ట్రాల నుంచి దాదాపు 158 మంది చిన్నారులు పాల్గొని అన్ని రాష్ట్రాల సంస్కృతులు, అలవాట్లను తెలుసుకుంటారని తెలిపారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో దాసరి భానుప్రకాష్, సునీల్‌కుమార్, త్యాగరాజన్, విజయ్‌కుమార్, మిశ్రా నిఖిల్, రాజేష్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



డ్రైనేజీలో నుంచి ఎగిసి పడుతున్న మంటలు, ఆర్పడానికి ప్రయత్నం చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఎర్రగుంట్ల : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులోని హెచ్‌పీ పెట్రోల్ సమీపంలో పెను ప్రమాదం తప్పింది. ఎవరికీ ఎలాంటి ఆపాయం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల వివరాల మేరకు.. గత కొన్ని రోజులుగా వర్షాలు కురవడంతో హెచ్‌పీ పెట్రోల్ బంకులోని ట్యాంక్‌లోకి నీరు చేరింది. దీంతో వాహన దారులకు పెట్రోల్, డీజిల్ వేయలేదు. ఆయిల్ ట్యాంక్‌కు లీకులు ఉండడంతో పెట్రోల్, డీజిల్ సమీపంలోని డ్రైనేజీ నీటిలో కలిసిపోయింది. దీంతో బంకు నిర్వాహకులు ట్యాంక్ చుట్టూ ఉన్న నీటిని తోడే ప్రయత్నం చేశారు. ఇదిలా ఉంటే ఒక్కసారిగా డ్రైనేజీ నుంచి మంటలు ఎగసిపడ్డాయి. సిమెంటు దిమ్మెలు పెద్ద శబ్దంతో ఒక పక్క పగిలిపోతుండగా.. మరోవైపు మంటలు వ్యాపించి పొగ కమ్మేసింది. స్థానికులంతా భయంతో పరుగులు తీశారు. సీఐ విశ్వనాథరెడ్డి చేరుకుని బంకు సిబ్బందితో మాట్లాడి మంటలు ఆర్పే ప్రయత్నం చేయించారు. అనంతరం ప్రొద్దుటూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి డ్రైనేజీలలో ఆయిల్‌ను తొలగించడానికి కెమికల్ వాడారు. దీంతో మంటలు అదుపులోకి వచ్చాయి. పెను ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఎస్‌జీఎఫ్ అండర్–19 క్రీడలు రెండో విడతగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ వృత్తి విద్యాధికారి టీఎస్‌వీ.వెంకటేశ్వర్లు, చంద్రమోహన్ రాజు తెలిపారు. క్రీడల్లో ప్రతిభ చూపిన వారిని అండర్19 జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. 27న కడప డీఎస్ఏ, ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్(షటిల్), అక్టోబరు7న మైదుకూరు మేథా డిఫెన్స్ అకాడమీలో అథ్లెటిక్స్, బాల్‌బ్యాడ్మింటన్, 8న పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, టెన్నికాయిట్ పోటీలు ఉంటాయన్నారు.

9న గండిక్షేత్రంలోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాలలో బాస్కెట్‌బాల్, హ్యాండ్ బాల్, 10న కడప వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌లో హాకీ, పవర్‌లిఫ్టింగ్, 11న ఓబుళవారి పల్లె ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాలలో ఖో ఖో, యోగా పోటీలు ఉంటాయని తెలిపారు. 11న చెన్నూరు మండలం రామన్నపల్లె జడ్పీ హైస్కూల్‌లో క్యారమ్స్, చెస్,

12న కోడూరు ఎస్‌వీ జూనియర్ కళాశాలలో కబడ్డీ, క్రికెట్, 13న చిన్నమండెం ఏపీఎంఎస్ జూనియర్ కాలేజీలో వాలీబాల్, త్రోబాల్ పోటీలు నిర్వహిస్తామని వివరించారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు తమ కళాశాల ప్రిన్సిపల్, హెడ్మాస్టర్ జారీ చేసిన స్టడీ సర్టిఫికెట్, జననతేదీ నిర్ధారణ సర్టిఫికెట్ తీసుకొని వేదికల వద్దకు ఉదయం ఎనిమిది గంటల లోపల హాజరుకావాలని కోరారు.

బైక్ ఢీకొని ఒకరు దుర్మరణం


మృతిచెందిన రాము(42)


ప్రాణాలతో బయటపడిన జగదీష్

రామాపురం/లక్కిరెడ్డిపల్లి : కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంలో అత్తారింటికి బయలుదేరిన రాము (42) రోడ్డు ప్రమాదంలో శుక్రవారం దుర్మరణం పాలయ్యారు. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని కసిరెడ్డిగారిపల్లి పంచాయతీ వడ్డెపల్లికి చెందిన రాము తన కుమారుడు జగదీష్‌తో కలిసి ద్విచక్ర వాహనంలో రామాపురం బయలుదేరారు. కర్నూలు–చిత్తూరు జాతీయ రహదారి మార్గంలో రామాపురానికి కూతవేటు దూరంలో మరో ద్విచక్ర వాహనం వీరి వాహనాన్ని ఢీకొంది. రోడ్డుమీద పడిన రాముపై వెనుక నుంచి అతివేగంగా వచ్చి లారీ దూసుకెళ్లడంతో అక్కడిక్కడే దుర్మరణం పాలయ్యారు. అతడి కుమారుడు జగదీష్ రోడ్డు ప్రక్కన పడడంతో ప్రమాదం నుండి బయటపడ్డాడు. కువైట్ నుంచి ఇటీవలే రాము స్వగ్రామానికి వచ్చాడు. అతడి మరణవార్త విని కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. రామాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కువైట్‌లో వడ్డిపల్లి వాసి మృతి

ఓబులవారిపల్లె : మండలంలోని వడ్డిపల్లి గ్రామానికి చెందిన పసుపులేటి వెంకటేష్(45) కువైట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బంధువుల కథనం మేరకు.. ఆరు నెలల క్రితం అప్పు చేసి జీవనోపాధికై వెంకటేశ్ కువైట్‌కు వెళ్లాడు. గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. శుక్రవారం మృత దేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. మృతుడి భార్య లక్ష్మీదేవి రెండేళ్ల కిందట జరిగిన ప్రమాదంలో కాలు, చేయి విరిగి వికలాంగురాలిగా మారింది. భార్యను కాపాడుకున్న వెంకటేష్ అప్పు తీర్చేందుకు గల్ఫ్ దేశానికి వెళ్లాడు. అతడి మరణంతో ఆ కుటుంబం దిక్కులేని స్థితికి చేరుకుంది. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. దాతలు ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరారు.

బాలకృష్ణా.. మెంటల్‌కు చికిత్స చేయించుకో..

– వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్రకార్యదర్శి దండు గోపి



రాజంపేట టౌన్ : 20 ఏళ్ల కిందట బాలకృష్ణకు మెంటల్ ఉందని వైద్యులు సర్టిఫికెట్ ఇచ్చారని, ఆయన సరైన చికిత్స చేయించుకోవడం లేదని.. దీంతో ఆయన పిచ్చి పీక్స్‌కు చేరిందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి దండుగోపి ఎద్దేవా చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల కిందట అసెంబ్లీలో బాలకృష్ణ మాట్లాడిన మాటలనుబట్టి రాష్ట్ర ప్రజలకు ఆయన వైఖరి స్పష్టంగా అర్థమైందన్నారు. బెల్లంకొండ సురేష్‌పై అతడు కాల్పులు జరిపినప్పుడు దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి దయచూపారని, లేకుంటే ఇప్పటికే జైల్లో చిప్పకూడు తినేవారంటూ ఆరోపించారు. ఇలాగే వదిలేస్తే అసెంబ్లీలో తోటి ఎమ్మెల్యేలు, మంత్రులపై చేయిచేసుకునే అవకాశం లేకపోలేదన్నారు. ప్రజాస్వామ్యంలో మర్యాద ఇచ్చి పుచ్చుకోవడం చాలాముఖ్యమని టీడీపీ నాయకులు గుర్తుంచుకోవాలన్నారు.